క్లుప్తంగా

ఎరువుల దుకాణాలు తనిఖీ



కొల్లిపర: మండల కేంద్రంలోని కొల్లిపర గ్రామంలో జిల్లా కమిషనరేట్‌లోని విజిలెన్స్ అధికారులు విజిలెన్స్ సీఐ సి.హెచ్.రమికుమార్, గన్నవరం ఏడీఏ ఎం.సునీల్, గుంటూరు రూరల్ ఏవో బి.కిషోర్ స్థానిక ఏవో శ్రీనివాసరెడ్డితో కలసి మంగళవారం ఎరువులు, పురుగు మందుల షాపులను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కొల్లిపర కృషి విజ్ఞాన్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ దుకాణంలో ఎరువులు, బిల్లుల పుస్తకాలు పరిశీలించగా బిల్లులకు, స్టాక్‌కు సరిపోకపోవడం వల్ల 494 బస్తాల ఎరువులకు సంబంధించిన రూ.4,72900 విలువగల ఎరువులను స్టాఫ్ సేల్ చేసినట్లు తెలిపారు.

అబాకస్‌లో భాష్యంకు రాష్ట్రస్థాయి బహుమతులు

తెనాలిఅర్బన్: అబాకస్ రాష్ట్రస్థాయి పోటీల్లో తెనాలిలోని భాష్యం స్కూల్ విద్యార్థులు సమీరా, సిరాజ్, తన్విలు మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ మణికాంత్ దత్ తెలిపారు. వీరిని స్కూల్ ఆవరణలో అభినందించి మెమోంట్‌లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నళిని జిగర్, హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: 35వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గొడవర్తి శ్రీ సాయి హరేరామ్ 61వ పుట్టిన రోజును పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. అలాగే బుర్రిపాలెంలోని ఓంకారా ఆశ్రమానికి రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ హరేరామ్ మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, కౌన్సిలర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాల పాలైన ఘటన తెనాలిలో మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా వేమూరు మండలం కుచ్చెళ్లపాడుకు చెందిన పి. నాగరాజు వ్యక్తిగత పనులపై తెనాలి వచ్చాడు. బైక్‌పై వెళుతున్న అతను మార్కెట్ వంతెన, బస్టాండ్ వంతెనల మధ్య ఆలపాటి వారధి వద్ద మలుపు తిరిగే క్రమంలో బైక్ అదుపుతప్పి ఆర్టీసీ బస్సు కింద పడ్డాడు. బస్సు వెనుక టైరు అతని కాలుపై నుండి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

నైపుణ్య శిక్షణపై అవగాహన

తెనాలిరూరల్: ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం(వరల్డ్ యూత్ స్కిల్స్ డే) సందర్భంగా పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రెడ్డి సుధాకర్ ఆధ్వర్యంలో ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ షేక్ గౌస్ మోహిద్దీన్ సహకారంతో ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి, క్రాఫ్ట్ మాస్టర్ కొతారపు శ్రీనివాసరావు యువతకి నైపుణ్య శిక్షణ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం ఇతర పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం బాలబాలికలకు పరికరాలు పంపిణీ

వేమూరు: బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని మండల విద్యా శాఖాధికారి జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో బాలబాలికలకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో చదువుతున్న బాలబాలికలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని తెలిపారు. భవిత కేంద్రం బాలబాలికలకు ఉచిత పాఠ్య పుస్తకాలు, బట్టలు, బ్యాగులు, అలెవెన్స్‌లు, ఉపకరణాలు అందించడం జరుగుతుందన్నారు. బాలిబాలికలు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో బాగా చదువుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, మోహన్‌రాజు, విజయలక్ష్మి, బాలబాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్



ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మీపతిరావుకు వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

తెనాలిఅర్బన్: మున్సిపాలిటీల పరిధిలోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 16 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, ఉద్యోగులు పాల్గొన్నారు. తెనాలి పురపాలక సంఘ పరిధిలోని 47 సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్‌ను ఇప్పించే విధంగా చూడాలని ఉద్యోగులు కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

- నందివెలుగులో 145 బస్తాల డీఏపీ సీజ్
- గన్నవరం సహాయ సంచాలకులు ఎం.సునీల్



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

తెనాలిటౌన్: రూరల్ మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం మెరుపుదాడి నిర్వహించారు. నందివెలుగు గ్రామంలోని శ్రీ సాయి కామాక్షి ట్రేడర్ షాపులో తనిఖీలు చేపట్టగా స్టాక్ రిజిష్టర్‌లో వ్యత్యాసాన్ని గుర్తించి 145 బస్తాల డీఏపీని సీజ్ చేశారు. తనిఖీ అధికారి, గన్నవరం సహాయ సంచాలకులు ఎస్.సునీల్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి మండలంలోని పలు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టగా నందివెలుగులోని కామాక్షి ట్రేడర్ షాపునందు భారీగా డీఏపీ బస్తాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వీటి ధర రూ.1,95,750లుగా వివరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతుల సేవార్థం రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా డీఏపీ, పురుగు మందులు, విత్తనాలు కలిగి ఉన్నట్లయితే కేసులు నమోదు చేస్తామని డీలర్‌లను హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.రవిబాబు, తెనాలి మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు, గుంటూరు మండల వ్యవసాయాధికారి బి.కిషోర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ రాధిక



అటెండెన్స్ పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 26వ వార్డులో మంగళవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలను ప్రతి రోజు శుభ్రం చేయాలని సూచించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారిణి డాక్టర్ మువ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

\+ విధులకు సకాలంలో హాజరు కావాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఆదేశించారు. గాంధీనగర్‌లోని శానిటరీ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం తెల్లవారుజామున ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రోడ్లు, కాల్వలను సకాలంలో శుభ్రం చేయాలని సూచించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.

డాక్టర్ రమేష్‌కు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన డాక్టర్ రంగిశెట్టి రమేష్‌కు హైదరాబాద్‌కు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక, తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ సంస్థ ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని అందజేసింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ వెంకట దీక్షితులు కళావేదికలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రమేష్ పురస్కారాన్ని అందుకున్నారు. సాహితీ రంగంలో చేసిన సేవలకు గాను పురస్కారాన్ని ఇచ్చినట్టు రమేష్ తెలిపారు. వంగాల శాంతి కృష్ణ, దైవజ్ఞ శర్మ, డాక్టర్ ఎస్.శాంతాబాయి, గుర్రం జాషువా వారసురాలు అమృతపూడి రేవతి, నవలా రచయిత్రి గంటా రజిని, డాక్టర్ పెద్దినపూడి ప్రశాంతి పాల్గొన్నారు.

పాస్టర్‌కు ఆర్థిక సాయం



తెనాలిరూరల్: పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి జులై మాస సమావేశాన్ని స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులోని జియోన్ ఫెయిత్ వే సిటీ చర్చ్‌లో బుధవారం నిర్వహించారు. ఆ సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పాముల పరంజ్యోతి అధ్యక్షత వహించారు. ఆ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన అసోసియేషన్ వ్యవస్థాపకులు, బిషప్ డాక్టర్ పినపాటి జాన్‌పాల్, బిషప్ కత్తెర సురేష్ కుమార్, బిషప్ పాముల పరంజ్యోతి, రెవ డేవిడ్ సామ్యూల్‌లు అసోసియేషన్ తరపున చేపట్టబోతున్న కార్యక్రమాలను వివరించారు. గుండె శస్త్ర చికిత్స చేయించుకోబోతున్న పాస్టర్‌కు ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్ కమిటీ సభ్యులు సువర్ణ రాజు, మల్లవరపు విజయ్ కుమార్, రెవరెండ్‌రావూరి విక్టర్ పాల్, గద్దం జాన్‌బాబు, షడ్రక్ పాల్గొన్నారు.

నేడు 1కే వాక్

తెనాలిరూరల్: ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై బుధవారం తెనాలి కొత్తపేటలోని కోర్టు ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి. శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టుల ప్రాంగణం నుంచి గాంధీచౌక్ వరకు 1కే వాక్ నిర్వహించనున్నట్టు న్యాయమూర్తి చెప్పారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు

తెనాలిటౌన్: ది కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ సేవలను తెనాలి ప్రాంత ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక దేవిచౌక్‌లోని బ్యాంకు కార్యాలయంలో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు పాల్గొని మాట్లాడారు. బ్యాంకు ఏర్పాటు చేసిన 27 సంవత్సరాలు అయినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 34 బ్రాంచ్‌లు కలిగి ఉన్నామని, కో-ఆపరేటివ్ బ్యాంకు సెక్టార్‌లో బ్యాంకు ఉన్న ప్రత్యేకతను వివరించారు.

అన్ని రకాల లోన్ సౌకర్యం ఉందని తెలిపారు. 1700 కోట్ల టర్నోవర్, 1030 కోట్ల డిపాజిట్లు , 700 కోట్ల లోన్స్‌తో తమ బ్యాంకు ముందజంలో ఉందని వెల్లడించారు. బ్యాంకు సిల్వర్ జూబ్లీ వేడుకలను ఎంతో వేడుకగా నిర్వహించినట్లు చెప్పారు. కేవలం రూ.500లతో తమ బ్యాంకులో ఖాతా తెరవవచ్చని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 47 కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో తమ బ్యాంకు టాప్-3లో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో సీఈవో కె.శ్యామ్ కిషోర్, ఓఎస్‌డీ వీఎస్‌డీ శాస్త్రి, రీజనల్ మేనేజర్ జాస్తి మురళి, మేనేజర్ బొప్పన వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రెండో రోజు కార్మెల్ మాత ఉత్సవాలు



దివ్యసత్ ప్రసాదాన్ని ఊరేగిస్తున్న విశ్వాసులు



వాక్యోపదేశం చేస్తున్న మేత్రాసన గురువులు

ఫిరంగిపురం: విశ్వాసులకు కోరిన వరాలనిచ్చే మాత కార్మెల్ తల్లి అని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. కార్మెల్ మాత ఉత్సవాల సందర్భంగా రెండో రోజు మంగళవారం దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. బాల ఏసుదేవాలయం వద్ద నుంచి మరియమాత విగ్రహం, దివ్యసత్ ప్రసాదాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగిస్తూ కార్మెల్ కొండకు తీసుకువచ్చారు. కొండ దిగువ భాగంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదిక వద్ద దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యయ్య వాక్యోపదేశం చేస్తూ దేవుడి ఆశీర్వాదానికి మనమందరం వారసులమని చెప్పారు. ఏటా కార్మెల్ మాత ఉత్సవం అనంతరం వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని తెలిపారు. అనంతరం దివ్యసత్ ప్రసాద పూజాబలి నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బాల ఏసుదేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి, సహాయ విచారణ గురువులు సాగర్, మఠకన్య స్త్రీలు, గుడిపెద్దలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

తాడేపల్లి రూరల్: తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 224 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, దర్శి మాణిక్యారావు, వై.సాంబశివరావులు ప్రారంభించారు. యూనియన్ నాయకుడు కె.స్టీవెన్ మాట్లాడుతూ.. కార్మికులు బకాయిలు అందేవరకు ఓపిగ్గా ఉండాలని అన్నారు. సమస్యకు పరిష్కారం దగ్గరలోనే ఉందని ఆయన కార్మికులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో యహోషువ, ఆశీర్వాదం, షైక్ ఆరిఫ్, మల్లె గురవయ్య, తుపాకుల నాగేశ్వరావు, బి.సూర్యప్రకాశరావు, డి.నాగేశ్వరావు, జి.నాగరాజు, అంకయ్య, షైక్ హిమాంబి, వై.రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి, శారమ్మ, కాసమ్మ, అన్నమ్మ, రిబ్కా, దేరంగుల రమణమ్మ, మొలక శారద, గండికోట జ్యోతి, దామవరపు సువర్ణకుమారి, బి.నవనితం పాల్గొన్నారు.

అర్చకుల బయోమెట్రిక్‌పై సానుకూల స్పందన



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నేతలు

నగరంపాలెం: ఆలయాల్లో పనిచేసే అర్చకులకు బయోమెట్రిక్ విషయంపై గందరగోళం నెలకొందని అర్చక జేఏసీ రాష్ట్ర నాయకులు జంధ్యాల వేంకటరామలింగేశ్వరశాస్త్రి, ఏంఏ శేషాచార్యులు పేర్కొన్నారు. మంగళవారం గొల్లపూడిలోని దేవదాయ శాఖ కార్యాలయంలో కమిషనర్ రామచంద్రమోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అర్చకులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై వినతిపత్రం అందించారు. అనంతరం బయోమెట్రిక్ మినహాయింపు విషయమై సడలింపు ఉత్తర్వులు జారీ చేశారని జేఏసీ నాయకులు తెలిపారు. అర్చకులకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. వేతన అర్చకులకు ట్రెజరీ జీతాలు అమలు చేసేందుకు దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ద్వారా ప్రభుత్వ దృష్టి తీసుకెళ్తామని వివరించారు.

నిబంధనలకు లోబడి దుకాణాలు నిర్వహించాలి

బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వర్లు



నగరం: నిబంధనలకు లోబడి మాత్రమే మద్యం దుకాణాలను నిర్వహించుకోవాలని బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి బి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి అనంతరం సిబ్బంది, మద్యం దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మద్యం దుకాణంలో గానీ, చుట్టుపక్కల గానీ మద్యం తాగరాదన్నారు. అదే విధంగా దుకాణం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దుకాణాల వద్ద తెలుగులో రాయబడిన ధరల పట్టిక బ్యానర్‌లను, క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా అతికించి ఉంచాలన్నారు. దుకాణాలకు వచ్చే వారి చేత క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించాలని సూచించారు. దుకాణాల వద్ద వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు లేకుండా చూసుకోవాలని, సమయపాలన పాటించాలన్నారు. అధిక ధరలకు విక్రయాలు జరిపితే సహించేది లేదన్నారు. అక్రమ మద్యం తయారీ, రవాణా, అమ్మకాలు ఎక్కడైనా జరిగినట్లయితే 14405 నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం సిబ్బందికి పెట్రోలింగ్ యాప్‌పై అవగాహన కల్పించి రికార్డులను పరిశీలించారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా తిరుపతి వెంకయ్య

కొల్లూరు: సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా పెసర్లంకకు చెందిన గళ్లా తిరుపతి వెంకయ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం మండలంలోని పెసర్లంకలో జరిగిన కార్యక్రమంలో భాగంగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సమక్షంలో గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా తిరుపతి వెంకయ్య, డైరెక్టర్‌లుగా కోగంటి వెంకటరామారావు, సుగ్గున వెంకటేశ్వరరావులు బాధ్యతలు స్వీకరించారు. తొలుత సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీలు కనగాల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న రంగంలో రాణించండి

ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఆకుల ఉదయ్‌కుమార్



మాట్లాడుతున్న కల్నల్ ఉదయ్ కుమార్

తెనాలిఅర్బన్: ఆసక్తి ఉన్న రంగంలో అందరూ రాణించే విధంగా చూసుకోవాలని 22వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఆకుల ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్, కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు నైపుణ్యాల ఆధారిత విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. కెఎస్ఎం స్కూల్ హెచ్ఎం కప్పల రాజారెడ్డి మాట్లాడుతూ యువత ఉద్యోగాలు పొందలేకపోవడానికి ప్రధాన కారణం వారు ఎంచుకున్న రంగంలో నైపుణ్యం లేకపోవడమేనని తెలిపారు. యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అనేక పథకాలు ప్రభుత్వాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. సమావేశాల్లో బాయ్స్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.ఇందుశేఖర్, ఉపాధ్యాయులు కొడాలి గోవర్ధన్, ఎన్.మస్తాన్‌రావు, ఎం.ప్రసాద్, కొండూరు శ్రీనివాసరావు, పరిశా సర్ధార్, అంబరీషుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కోవాలి

తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ



విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

తెనాలిరూరల్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొవడంలో సమర్థవంతంగా వ్యవహరించాలని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. రూరల్ గ్రామం కొలకలూరు బోసు బొమ్మ సెంటర్ పురవేదికపై తాడేపల్లి ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎన్డీఆర్ఎఫ్ బృందం గ్యాస్ లీకేజీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర కారణాలతో సంభవించిన అగ్ని ప్రమాదాలను తప్పించుకోవడంలో పాటించాల్సిన విధానాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించే విధానాన్ని కూడా తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్డీఆర్ఎఫ్ బృందం నేర్పిన మెలకువలను విద్యార్థులు గుర్తించుకోవాలని, తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, జెడ్పీ హైస్కూలు విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్ మోటార్ కనెక్షన్‌లు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ చందు సాంబశివుడు

తెనాలిటౌన్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు నీటి ఎద్దడి లేకుండా విద్యుత్ మోటార్ కనెక్షన్‌లు సత్వరమే ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవికి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వర్షాభావం ఉన్నందున చివరి భూములకు నీటి ఎద్దడి లేకుండా అవసరమైన ప్రతి రైతుకువిద్యుత్ మోటార్ కనెక్షన్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పి.నాగసూర్యశశిధరరావు, పెనుగొండ శివకుమార్, పి.స్టీవెన్ బాబు, రాయప్ప, కోటేశ్వరరావు, వీరాస్వామి, అయ్యప్ప, అఖిల్, పూలేరామ్, మల్లిఖార్జునరావు, ద్వారక శ్రీను, తదితరులు ఉన్నారు.

పెసర్లంక జెడ్పీ పాఠశాల విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు

పెసర్లంక(భట్టిప్రోలు): మండలంలోని పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన గుంటూరు పూజిత రెండవ కోటాలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ పాఠశాలలో పూజితతో కలిపి మొత్తం 8 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అంబటి జాకబ్ మంగళవారం తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా ఆంగ్ల ఉపాధ్యాయులు వి.వెంకటేశ్వరరావు, వి.పరమేశ్వరరావులు పూజితను అభినందించి రూ.3,500 విలువ కలిగిన సూట్‌కేస్, సర్టిఫికెట్ ఫైల్స్‌ను అందజేశారు.